RNI No: APTEL/2018/76747



# నవతరం

DYNAMIC EDITION తెలుగు దినపత్రిక






| హైదరాబాద్ | బుధవారం | సంపుటి: 9 | సంచిక: 246 | పేజీలు: 04 | వెల: 5 /- | 23 సెప్టెంబర్ 2026 |

# ఐఐటీ బాంబే విద్యార్థి ఆత్మహత్య

- **కుల వివక్ష గురించి ముందే చెప్పాడు అన్న సాహిల్ తండ్రి**
- **"భరించమని చెప్పా" అంటూ తండ్రి ఆవేదన**
- **ప్రొఫెసర్ సూర్యనారాయణపై కుటుంబం తీవ్ర ఆరోపణలు**
- **ఆత్మహత్యకు ప్రేరేపించారన్న కేసులో ఎఫ్ఐఆర్**
- **కేసును దర్యాప్తు చేస్తున్న ముంబై క్రైమ్ బ్రాంచ్**
- **సూర్యనారాయణను డీన్ బాధ్యతల నుంచి తప్పించిన ఐఐటీ**

**ముంబై, నవతరం:** "నా కొడుకు కుల వివక్ష గురించి ముందే చెప్పాడు. ఐఐటీలో సీటు రావడం చాలా కష్టం.. భరించమని చెప్పా".. ఐఐటీ బాంబే విద్యార్థి సాహిల్ వాకోడే తండ్రి రవీంద్ర వాకోడే చేసిన ఈ వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. సెప్టెంబర్ 18న హాస్టల్ గదిలో సాహిల్ మృతిచెందిన ఘటనపై ఇప్పటికే దర్యాప్తు కొనసాగుతుండగా.. తన కొడుకును ప్రొఫెసర్ సూర్యనారాయణ దుల్లా కులం పేరుతో వేధించేవారని తండ్రి ఆరోపించారు. ప్రొఫెసర్‌ను వెంటనే అరెస్టు చేయాలని కుటుంబం డిమాండ్ చేస్తోంది. "సూర్యనారాయణ నా కొడుకుపై కుల వివక్ష చూపేవాడు. ఈ విషయం సాహిల్ గతంలోనే మాకు చెప్పాడు. కానీ ఐఐటీలో సీటు సాధించడం ఎంత కష్టమో తెలుసు కాబట్టి భరించమని చెప్పా" అని రవీంద్ర తెలిపారు. "మేం తల్లిదండ్రులుగా మా బిడ్డకు మానసికంగా అండగా నిలిచాం. అదే మా తప్పా?" అని సాహిల్ తల్లి సోనాలి వాకోడే ప్రశ్నించారు. ప్రొఫెసర్ సూర్యనారాయణతో పాటు ఐఐటీ బాంబే డైరెక్టర్ శిరీష్ కేదారేపైనా కుటుంబం ఆరోపణలు చేసింది. కేదారే మాత్రం కుల వివక్ష ఆరోపణలను ఖండించారు. సాహిల్ మరణంపై అతడి తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోవై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు ప్రేరేపించారన్న ఆరోపణలతో భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 108తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టంలోని నిబంధనలను కూడా కేసులో చేర్చారు. ప్రొఫెసర్ సూర్యనారాయణతో పాటు మరికొందరి పేర్లు ఫిర్యాదులో ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ కేసును ప్రస్తుతం ముంబై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేస్తోంది. ఆరోపణలపై పూర్తి విచారణ తర్వాతే వాస్తవాలు తేలాల్సి ఉంది. సాహిల్ పరీక్షలో మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ పట్టుబడ్డాడని ఐఐటీ బాంబే తొలుత వెల్లడించింది. ప్రశ్నపత్రాన్ని చాట్‌జీపీటీలోకి పంపి సమాధానాలు పొందేందుకు ప్రయత్నించాడని కూడా పేర్కొంది. అయితే తర్వాత ఆ ప్రకటనపై సంస్థ క్షమాపణ చెప్పింది. ఘటనకు దారితీసిన పరిస్థితులు ఇంకా దర్యాప్తులో ఉన్నందున ముందుగానే వాటిని నిర్ధారించడం సరికాదని స్పష్టం చేసింది. పరీక్ష సమయంలో సాహిల్ ఇన్విజిలేటర్‌గా ప్రొఫెసర్ సూర్యనారాయణ ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కుటుంబం ఆయనపై ఆరోపణలు చేసింది. మరోవైపు ఐఐటీ బాంబే ఫ్యాకల్టీ ఫోరం సదరు ప్రొఫెసర్‌కు మద్దతుగా నిలిచింది. ఆయన్ను డీన్ (అడ్మినిస్ట్రేటివ్ అఫైర్స్) బాధ్యతల నుంచి తప్పించినా, విద్యార్థులు మాత్రం అది సరిపోదని చెబుతున్నారు. ఆయనను ప్రొఫెసర్ పదవి నుంచి కూడా తప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. "నా కొడుకు చాలా ప్రతిభావంతుడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సీటు సాధించడం సాధారణ విషయం కాదు. ఇప్పుడు రకరకాల ఆరోపణలు చేసి అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేయొచ్చు. నిందితులను అరెస్టు చేయడమే మా డిమాండ్" అని రవీంద్ర వాకోడే అన్నారు. సాహిల్ కుటుంబం ఈ కేసులో సీబీఐ దర్యాప్తు కూడా కోరుతోంది.

సాహిల్ మృతితో ఐఐటీ బాంబే క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు, విద్యార్థుల భద్రత, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో మార్పులు సహా 18 డిమాండ్లను విద్యార్థులు సంస్థ ముందుంచారు. ఈ కేసులో కుల వివక్ష, వేధింపుల ఆరోపణలు ఇంకా దర్యాప్తులోనే ఉన్నాయి.



# నిమ్స్ వైద్యుడి నివాసంలో ఏసీబీ సోదాలు

- **నిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్‌పై ఏసీబీ దాడులు**
- **రూ.80 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించిన అధికారులు**
- **హైదరాబాద్, విశాఖ, ఇతర ప్రాంతాల్లో ఫ్లాట్లు, ప్లాట్లు, బంగారం**
- **బ్యాంకుల్లో రూ.41 లక్షల నగదు, ప్రైవేటు సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు**
- **20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తున్న లక్ష్మీభాస్కర్‌పై గతంలోనూ ఆరోపణలు**







**హైదరాబాద్, నవతరం:** హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నిమ్స్ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీభాస్కర్ నివాసంలో భారీగా ఆస్తులు వెలుగుచూశాయి. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం ఏకకాలంలో ఆయన నివాసం, కార్యాలయంతో పాటు మరో ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ .80 కోట్లకు పైగా విలువైన స్థిర, చరాస్తులను గుర్తించడంతో అధికారులు విస్తుపోయారు. ఏసీబీ గుర్తించిన ఆస్తుల వివరాల ప్రకారం, కూకట్‌పల్లిలో రెండు విలాసవంతమైన ఫ్లాట్లు, మణికొండ, పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో మరో ఐదు ఫ్లాట్లు ఉన్నాయి. వీటితో పాటు యాదాద్రి, నందిగామ, శామీర్‌పేటలో నాలుగు ఓపెన్ ప్లాట్లు, విశాఖపట్నంలో 800 గజాల స్థలం ఉన్నట్లు తేలింది. అలాగే, వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ. 41 లక్షల నగదు, పోస్టాఫీసు ఖాతాల్లో రూ. 12 లక్షల డిపాజిట్లు, ఒక ప్రైవేటు సంస్థలో రూ. 35 లక్షల పెట్టుబడులు ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. వీటితో పాటు 517 గ్రాముల బంగారం, మూడు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

డాక్టర్ లక్ష్మీభాస్కర్ గత 20 ఏళ్లుగా నిమ్స్‌లో పనిచేస్తుండగా, గత ఐదేళ్లుగా డిప్యూటీ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనపై గతంలోనూ పలు ఆరోపణలు వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఏసీబీ అధికారులు లభ్యమైన ఆస్తుల పూర్తి విలువను అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.







# జూరాలకు నీళ్లివ్వండి

**హైదరాబాద్, నవతరం:** ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కోరారు. మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు. జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మేగా రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కర్ణాటక సీఎంతో చర్చించాల్సిన అంశాలపై వారితో మాట్లాడారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు బెంగళూరుకు బయలుదేరారు. మంగళవారం రాత్రి 8 గంటలకు శివకుమార్‌తో భేటీ కానున్నారు. జూరాలకు నీరు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పనున్నారు. ఐదు టీఎంసీల నీటిని ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేయాలని కోరనున్నారు. జూరాలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు ఇప్పటికే ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. దీంతో జూరాల నీటి వ్యవహారం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.





# సీఐ శ్రీనివాసులు రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట

**హైదరాబాద్, నవతరం:** మహిళపై లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడి బలవంతంగా అబార్షన్ చేయించారనే తీవ్ర ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన జూబ్లీహిల్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డికి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో తదుపరి విచారణ జరిగే వరకు శ్రీనివాసులు రెడ్డిని అరెస్టు చేయవద్దని, ఆయనపై ఎలాంటి బలవంతపు చట్టపరమైన చర్యలు తీసుకోవద్దని హైదరాబాద్ పోలీసులకు సుప్రీంకోర్టు స్పష్టమైన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహాదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై ఈరోజ సుదీర్ఘ విచారణ చేపట్టింది. బాధితురాలిని లైంగికంగా వేధించారనే ఆరోపణలపై గతంలో తెలంగాణ ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ క్రమంలో అరెస్టు నుంచి మినహాయింపు కోరుతూ ముందస్తు బెయిల్ కోసం ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఆయన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ శ్రీనివాసుల రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో, సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టి పోలీసులకు రక్షణ ఉత్తర్వులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.



# ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది

**హైదరాబాద్, నవతరం;** తెలంగాణ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం అమలు, సంక్షేమ పథకాల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, తమ ప్రభుత్వం దళితులు, ఆదివాసీలు, గిరిజనుల సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు. పేద ప్రజలకు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూముల పట్టాలు అందించిన ఇందిరా గాంధీ స్ఫూర్తితోనే తమ ప్రజా పాలన కొనసాగుతోందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో 31 శాతం దళితులకు, 17 శాతం ఎస్టీలకు మంజూరు చేసి సంక్షేమంలో పెద్దపీట వేశామని వెల్లడించారు. అట్టడుగు వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న పలు విప్లవాత్మక చర్యలను సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఉదయం పూట పౌష్టికాహార బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని, అలాగే 3 కోట్ల 48 లక్షల మంది ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తూ పేద కుటుంబాలకు నాణ్యమైన భోజనాన్ని చేరవేస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగే దాడులు, అత్యాచార ఘటనలపై ప్రభుత్వం అత్యంత కఠినంగా స్పందిస్తుందని స్పష్టం చేశారు. బాధితులకు అందాల్సిన నష్టపరిహార నిధులను బడ్జెట్ అడ్డంకులు లేకుండా నేరుగా 'గ్రీన్ ఛానెల్' ద్వారా తక్షణమే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యా వికాసమే పేదరికాన్ని నిర్మూలిస్తుందని, అందుకే పిల్లలను చదువు, క్రీడల వైపు ప్రోత్సహించాలని, రాజకీయాలకు అతీతంగా ఈ వర్గాల పురోగతికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



# పలు జిల్లాలకు 'ఆరెంజ్' హెచ్చరిక

**హైదరాబాద్, నవతరం:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తాయని పేర్కొంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో అతి భారీ వర్షాలు, మరో 20 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు అధికారులు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం రానున్న 12 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.



# బెంగళూరుకు తెలంగాణ మంత్రులు

- జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదలపై కర్ణాటకతో చర్చలు
- నేడు బెంగళూరు వెళ్లనున్న తెలంగాణ మంత్రుల బృందం
- కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో సమావేశం కానున్న మంత్రులు
- ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి నీరు కోరనున్న తెలంగాణ
- సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అనంతరం మంత్రుల పయనం



**హైదరాబాద్, నవతరం:** జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని కోరేందుకు తెలంగాణ మంత్రుల బృందం మంగళవారం బెంగళూరుకు బయలుదేరనుంది. కృష్ణా బేసిన్‌లో నెలకొన్న నీటి కొరత నేపథ్యంలో, పొరుగు రాష్ట్రమైన కర్ణాటకతో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ పర్యటనలో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేల బృందం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశం కానుంది. ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి జూరాల ప్రాజెక్టుకు సాగునీటిని విడుదల చేయాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేయనున్నారు. అంతకుముందు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. జూరాల ప్రాజెక్టు నీటి అవసరాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చల అనంతరం, కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం మేరకు మంత్రుల బృందం నేడు సాయంత్రం బెంగళూరుకు పయనం కానుంది. ఇరు రాష్ట్రాల మధ్య జరిగే ఈ ద్వైపాక్షిక చర్చల ద్వారా జూరాల ఆయకట్టు రైతులకు తగిన ఊరట లభిస్తుందని తెలంగాణ ప్రభుత్వం ఆశిస్తోంది.

# వినాయకుడి మెడలో నోట్ల దండ చోరీ

**రాజన్న సిరిసిల్ల జిల్లా, నవతరం:** వేములవాడ పట్టణంలో వినాయక చవితి వేడుకల వేళ ఒక ఆసక్తికర ఉదంతం చోటుచేసుకుంది. పట్టణంలోని బద్దిపోచమ్మ వీధిలో జీవైసీ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుని విగ్రహానికి రూ. 500 నోట్లతో రూపొందించిన రూ.50 వేల విలువైన భారీ నోట్ల దండను నిర్వాహకులు ఎంతో భక్తిశ్రద్ధలతో అలంకరించారు. అయితే, తెల్లవారుజామున సమయం చూసి అక్కడకు చేరుకున్న ఓ అపరిచిత వ్యక్తి ఆ నోట్ల దండను కాజేశాడు. అయితే, మండపం సమీపంలో ఉన్న యూత్ సభ్యులు ఆ చోరీ యత్నాన్ని వెంటనే గమనించారు. దీంతో భయపడి పారిపోతున్న నిందితుడిని యువకులు వెంబడించి, కొంతదూరంలోనే చాకచక్యంగా పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి రూ.50 వేల విలువైన నోట్ల దండను స్వాధీనం చేసుకుని, నిందితుడిని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, అదుపులోకి తీసుకున్న యువకుడి నేపథ్యంపై విచారణ వేగవంతం చేశారు.



# అగ్నిప్రమాదంలో ఇద్దరు పసికందుల మృతి

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణలోని ఆదిలాబాద్ రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో సోమవారం అర్ధరాత్రి ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లో అగ్నిప్రమాదం జరగడంతో ఇద్దరు నవజాత శిశువులు మరణించారు. అప్రమత్తమైన సిబ్బంది వార్డులోని మరో 28 మంది చిన్నారులను సురక్షితంగా బయటకు తరలించడంతో పెను ప్రమాదం తప్పింది. సోమవారం రాత్రి సుమారు 11:50 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఎయిర్ కండిషనర్ (ఏసీ)లో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు అధికారులు భావిస్తున్నారు. కొద్దిసేపట్లోనే వార్డు మొత్తం దట్టమైన పొగ, అగ్నికీలలతో నిండిపోయింది. అయితే, ప్రమాదానికి కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు తర్వాతే స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ దురదృష్టకర ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై లోతుగా విచారణ జరుపుతున్నారు. ముఖ్యంగా ఎస్ఎన్‌సీయూలోని ఎలక్ట్రికల్ వ్యవస్థ, ఏసీ పరికరాలు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా? లేదా? అనే కోణంలో దర్యాప్తు సాగనుంది. ఈ మరణాలకు సిబ్బంది నిర్లక్ష్యం ఏమైనా కారణమా? అనే అంశాన్ని కూడా తేల్చనున్నారు.

**సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి.. విచారణకు ఆదేశం**

రిమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు శిశువులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో ప్రభావితమైన మిగతా చిన్నారులందరికీ అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి, సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో ఫైర్, ఎలక్ట్రికల్ భద్రతా చర్యలను పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న ప్రమాదం జరిగిన రిమ్స్‌ను సందర్శించి విచారం వ్యక్తం చేశారు.







# ఓయోలో 'విశాఖ యువతి' అనుమానాస్పద మృతి

**మాదాపూర్, నవతరం:** హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఓ యువతి అనుమానాస్పద రీతిలో మృతి చెందడం కలకలం రేపుతోంది. సిద్దిఖీ నగర్‌లోని ఓ ఓయో హోటల్‌లో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రియుడితో కలిసి హోటల్‌కు వచ్చిన యువతి మరణించడం, అనంతరం అతను పరారీ కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనపై మాదాపూర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన షారోన్ నిఖితా టోప్నో, తన ప్రియుడు శ్రీనివాస రవితేజతో కలిసి మాదాపూర్‌లోని ఓయో హోటల్‌లో రూమ్ నంబర్ 303 బుక్ చేసుకుంది. అయితే, అర్ధరాత్రి సమయంలో రవితేజ హోటల్ సిబ్బంది వద్దకు వచ్చి, తనతో ఉన్న నిఖితా అపస్మారక స్థితిలోకి వెళ్లిందని చెప్పాడు. సిబ్బంది సహాయంతో ఆమెను హుటాహుటిన కొండాపూర్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి విచారణ ప్రారంభించారు.

మృతురాలి ముఖం, తల భాగంలో గాయాలు, వాపులు ఉండటంతో దీనిని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించగా, వారు బస చేసిన గదిలోని గోడలు, బెడ్‌షీట్‌పై రక్తపు మరకలు కనిపించాయి. గదిలో ఖాళీ బీర్, విస్కీ బాటిళ్లు కూడా లభ్యం కావడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిఖిత మరణించిన విషయం తెలియగానే రవితేజ ఆస్పత్రి నుంచి పరారయ్యాడు. దీంతో అతనిపై అనుమానాలు మరింత బలపడ్డాయి. అతని ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. రవితేజ ఫోన్ సిగ్నల్స్ చివరిసారిగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద నమోదై, ఆ తర్వాత స్విచ్ఛాఫ్ అయినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం క్లూస్ టీమ్ హోటల్ గదిలో కీలక ఆధారాలను సేకరిస్తోంది. హోటల్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు విశ్లేషిస్తున్నారు.




# 250 మందికి పైగా వైసీపీ నేతలపై కేసులు

**విజయవాడ, నవతరం:** విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన వైసీపీ నేతలపై కేసులు పెట్టారంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... డీఎస్సీ అక్రమాలపై శాంతియుతంగా నిరసన తెలిపిన తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం కావాలనే దాడులు చేయించి, రివర్స్ లో అక్రమ కేసులు బనాయించిందని మండిపడ్డారు. విజయవాడ ఘటనతో ఏమాత్రం సంబంధం లేని 250 మందికి పైగా వైసీపీ నాయకులపై భిన్నమైన తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం ముమ్మాటికీ కక్షసాధింపు రాజకీయమేనని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ల దిశానిర్దేశంలోనే ఈ అక్రమ కేసుల పర్వం నడుస్తోందని అంబటి రాంబాబు విమర్శించారు.

ఘటన సమయంలో విజయవాడలోనే లేని వారిపై కూడా కేసులు పెట్టారని, రాత్రికి రాత్రే నోటీసులు కూడా ఇవ్వకుండా మఫ్టీలో వచ్చి వైసీపీ నాయకులను లాక్కెళ్లడం పోలీసుల దుర్మార్గానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అధికారం శాశ్వతం కాదని, పోలీసు వ్యవస్థను వాడుకుంటూ అన్యాయంగా ప్రవర్తిస్తున్న నారా లోకేశ్, అందుకు సహకరిస్తున్న అధికారులకు రాబోయే రోజుల్లో చట్టం పదునేంటో చూపిస్తామని, న్యాయస్థానాల ద్వారా చట్టపరమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు.



# రూ.1,500 కోట్ల అభివృద్ధి పండుగ

**కాకినాడ, నవతరం:** పిఠాపురం నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండో రోజు విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుతో పాటు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు రూ.1,500 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి, సంక్షేమ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పర్యటనలో భాగంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకుని, ఏకాదశి వ్రతాచరణ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాభివృద్ధికి కేటాయించిన రూ.90 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన రథశాల, యాగశాల, కాలక్షేప మండపం, అన్నదాన హాలు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం యు.కొత్తపల్లి మండలంలో రూ.9.59 కోట్లతో పునరుద్ధరించిన నాగులపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించి, 52 ఆవాసాలలోని సుమారు 97 వేల మంది ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తెచ్చారు. కొండేవారంలో ఇంటింటి కుళాయి కనెక్షన్లను స్వయంగా పరిశీలించారు. ఆర్ఆర్ బీహెచ్ఆర్ మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న పవన్ కల్యాణ్, స్వయం సహాయక సంఘాలకు రూ.120 కోట్ల రుణాల చెక్కులు, లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ ఇళ్ల పట్టాలు, మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు, పదో తరగతి ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు.

పిఠాపురం పట్టణంలో శాశ్వత డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం, రూ.225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, రూ.34 కోట్లతో దేవాలయాల పునరుద్ధరణ, రూ.323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి కీలక ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతులు పవన్ కల్యాణ్‌కు నాగలిని కానుకగా ఇచ్చి తమ కృతజ్ఞతలు తెలిపారు.






# రాజీనామా చేసే వరకు ఆందోళనలు ఆగవు

**అమరావతి, నవతరం:** డీఎస్సీ నియామకాల్లో అవకతవకలు జరిగాయని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. లోకేశ్ తన పదవికి రాజీనామా చేసి, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించే వరకు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.



ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం వద్ద తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారని జగన్ ఆరోపించారు. ఉపాధ్యాయుల ముసుగులో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు దాడులకు తెగబడ్డారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తనకు తానుగా క్లీన్ చిట్ ఇచ్చుకుంటే దానికి విలువ ఉండదని, చిత్తశుద్ధి ఉంటే ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు అంగీకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్‌లకు ఆయన సవాల్ విసిరారు."లక్షలాది మంది నిరుద్యోగ యువత ఏళ్ల తరబడి కష్టపడి చదువుకుంటూ, ఎంతో ఖర్చు చేస్తున్నారు. వారికి న్యాయం జరగాలంటే నియామక ప్రక్రియలో పారదర్శకత అత్యవసరం" అని జగన్ పేర్కొన్నారు. పోలీసు బారికేడ్లు, లాఠీఛార్జీలు, అరెస్టులతో ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించలేరని, ఈ కుంభకోణంపై సీబీఐ విచారణ జరపడమే ఏకైక మార్గమని ఆయన తేల్చిచెప్పారు.

# 'గాజులరామారం' సర్కిల్ లో..
# అడ్డగోలు అక్రమ నిర్మాణాలు

**కుత్బుల్లాపూర్, నవతరం:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ జోన్, గాజులరామారం సర్కిల్ లో రోజురోజుకు బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొందరు నిర్మాణదారులు భారీ కమర్షియల్ షెడ్లు నిర్మిస్తుంటే.. 'పల్లికాయంత పర్మిషన్.. నిమ్మకాయంత నిర్మాణం' అన్న చందంగా మరికొందరు నిర్మాణదారులు తమ తెలివిని చాటుకుంటూ.. 'మూడు పువ్వులు.. ఆరు కాయలు' అన్నట్టు తమ బిజినెస్ ను పెనచూకుంటూ 'రెండు అంతస్తుల కు అనుమతులు పొంది.. నాలుగు, ఆరు అంతస్తుల నిర్మాణాలు' కొనసాగిస్తున్నారు. టీజీ - బీ పాస్ చట్టానికి లోబడి పొందిన అనుమతులకు అనుగుణంగా భవన నిర్మాణాలు కొనసాగించాల్సిన నిర్మాణదారులు.. చట్టం అంటే గౌరవం లేకుండా బరితెగించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అందుకు కుత్బుల్లాపూర్ జోన్, గాజులరామారం సర్కిల్ టౌన్ ప్లానింగ్ పరోక్షంగా అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారు. కేవలం నోటీసుల పేరుతో కాలాయాపన చేస్తూ.. అందినకాడికి దండుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం గాజులరామారం, మహదేవపురం, దేవేందర్ నగర్, కైసర్ నగర్, ఉషోదయ కాలనీ, కైలాష్ హిల్స్, శిరిడీ హిల్స్ లో ఫిర్యాదులు అందినా పూర్తయిన నిర్మాణాలే.. మున్సిపల్ అధికారుల నుండి పొందిన అనుమతులకు విరుద్ధంగా కొన్ని వందల సంఖ్యలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను చూస్తుంటే 'గాజులరామారం సర్కిల్' లో టౌన్ ప్లానింగ్ అనే వ్యవస్థ ఉందా అనే అనుమానం కలగడం సహజం. వందలో ఏ ఒక్కరో చట్టానికి లోబడి నిర్మాణాలు చేస్తున్నారు తప్ప.. కొందరు నిర్మాణదారులు కాసుల కక్కుర్తిలో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే.. టౌన్ మరికొందరు మాత్రం అసలు ఇక్కడ టౌన్ ప్లానింగ్ యంత్రాంగం అనేదే లేదన్నట్టుగా.. హుందాగా.. నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. మొన్నటికి మొన్న మాదాపూర్ డివిజన్ అంజయ్య నగర్ లో 60 కూలిన భవన నిర్మాణంలో అకారణంగా ఇద్దరు కార్మికులు ప్రాణం పోగొట్టుకున్నారు. అయినా కాసుల కక్కుర్తిలో మునిగితెలుస్తున్నా 'గాజులరామారం సర్కిల్' టౌన్ ప్లానింగ్ అధికారులు నర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. ఒక్కో అక్రమ నిర్మాణానికి గత ఉప కమిషనర్ మల్లారెడ్డి రెండు లక్షల రూపాయలు తీసుకుని బై - నంబర్ లో సైతం అనుమతులిచ్చినట్టు.. ప్రస్తుతం ఉన్న డిప్యూటీ కమిషనర్ అదే బాట లో నడుస్తున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. అనుమతుల మాటలు కాక ఎలాంటి అనుమతులు లేని బహుళ అంతస్తుల భవన నిర్మాణాపై చర్యలు తీసుకోవాలని, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డా. జి. సృజన, ఐఏఎస్ సూచించినా.. కమిషనర్ ఆదేశాలను సైతం బేకాతర్ చేస్తూ.. పూర్తి నిర్మాణాలను తొలగించాల్సింది పోయి, కేవలం ఏదో ఒక అంతస్థులో ఒక శ్లాబ్ లో కొంత భాగాన్ని తొలగించి ఫోటో షూట్ చేసుకుని.. అడ్డదారిన కింది స్థాయి సిబ్బందితో కలెక్షన్ లకు పాల్పడుతున్నారని తెలుస్తుంది. అనుమతుల్లేని నిర్మాణాలపై ఫిర్యాదులకు నామమాత్రంగా స్పందిస్తూ.. అక్రమ నిర్మాణదారులకు కొమ్ముకస్తున్న గాజులరామారం టౌన్ ప్లానింగ్ అధికారులు, వారికి మద్దతు తెలుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ను కోరుకుంటున్నారు స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు.


మహదేవపురం ప్లాట్ నం. U - 73 లో బండారు రాజమహేంద్ర నిర్మించిన అక్రమ నిర్మాణం



మహదేవపురం ప్లాట్ నం. U - 73 ముందు బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణం


గాజులరామారం సర్కిల్ - 57 పరిధిలోని మహదేవపురంలో వెలిసిన కమర్షియల్ షెడ్డును పాక్షికంగా కూల్చివేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు


దేవేందర్ నగర్.. బందా నవాజ్ బస్తీ లో 'మోయినుద్దీన్' నిర్మించిన 60 గజాల్లో.. 4 అంతస్తుల అక్రమ ఇంటి నిర్మాణం


అక్రమనిర్మాణానికి అడ్డుకట్ట పడేనా...?


రావి నారాయణ రెడ్డి నగర్ - ఈస్ట్ 6 లో.. దుర్గారావు నిర్మించిన అక్రమ నిర్మాణం (పూర్తి)


గాజులరామారం నవీన్ వైన్స్ పక్కన వెలిసిన '100 PLATES FOOD COURT' హోటల్ అక్రమ షెడ్డు నిర్మాణం


గాజులరామారం సర్కిల్ - 57.. గాజులరామారం - మహదేవపురం ప్రధాన రహదారి పక్కనే జీరో అనుమతులతో వెలుస్తున్న అక్రమ షెడ్డు నిర్మాణం



గాజులరామారం మహారాజ గార్డెన్స్, రత్నదీప్ షాపింగ్ మాల్ పక్కన జీరో అనుమతులతో వెలిసిన (యాక్సెస్ వేర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్) భారీ కమర్షియల్ షెడ్డు నిర్మాణం..

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA), Ph.D(Hons) in Mass Communication & Journalism - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India.
https://epaper.navatharam.com